# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు ఉద్దేశించిన పబ్లిక్ పరీక్షల (అక్రమాల నివారణ) సవరణ బిల్లు-2026కు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- వందేమాతరానికి జనగణమనతో సమానమైన చట్టబద్ధ రక్షణ కల్పించే బిల్లును రాజ్యసభ ఆమోదించింది.
- ప్రపంచ పులుల జనాభాలో దాదాపు 70 శాతం పులులు భారతదేశంలోనే ఉండటం దేశ ప్రజలందరికీ గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారుల అద్భుత ప్రదర్శనతో ఇప్పటివరకూ 12 పతకాలను గెలుచుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షల్లో అక్రమాలను మరింత కఠినంగా అరికట్టేందుకు ఉద్దేశించిన పబ్లిక్ పరీక్షల (అక్రమాల నివారణ) సవరణ బిల్లు-2026కు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ప్రశ్నా పత్రాల లీకేజీలు, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, 10 కోట్ల రూపాయల వరకు జరిమానా విధించడంతో పాటు, దోషుల ఆస్తులను స్వాధీనం చేసుకునే నిబంధనలను ఈ బిల్లులో చేర్చారు. అక్రమాలకు సంబంధించిన కేసులను వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని బిల్లు నిర్దేశించింది. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన తేదీ నుంచి రెండు నెలల్లోపు దర్యాప్తు పూర్తి చేయాలి, చార్జ్‌షీట్ దాఖలు చేసిన తర్వాత మూడు నెలల్లోపు విచారణ ముగించాలి అనే కాలపరిమితులను కూడా ఈ చట్టం నిర్దేశించింది. ఈ బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... చట్టాన్ని మరింత కఠినతరం చేయడంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం

అందించేందుకు ఈ సవరణలు తీసుకొచ్చామని తెలిపారు. విద్యార్థులు, యువత సంక్షేమాన్ని కాపాడాలన్న కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పార్లమెంటులో అనుచిత పదజాలం ఉపయోగించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఖండిస్తూ.. విద్యార్థుల నిరసనల్లో ఎలాంటి కాల్పులు జరగలేదని, కేవలం భాష్ప వాయువు మాత్రమే వినియోగించారని ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిందని జితేంద్ర సింగ్ వివరణ ఇస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

ఈ బిల్లు ఆమోదం అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను రేపు ఉదయం 11 గంటల వరకూ వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు–2026కు రాజ్యసభ ఈరోజు ఆమోదం తెలిపింది. ఈ సవరణతో వందేమాతరానికి జాతీయ గీతం జనగణమనతో సమానమైన చట్టబద్ధ రక్షణ కల్పించనున్నారు. వందేమాతరాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించిన వారిపై గరిష్ఠంగా మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా లేదా రెండింటినీ విధించే అవకాశం ఈ బిల్లులో ఉంది. ఈ బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ.. ఈ సవరణ కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటం, ఆదర్శాల పట్ల దేశ సమిష్టి నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. 1971లో తీసుకొచ్చిన జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం ద్వారా జాతీయ పతాకం, రాజ్యాంగం, జాతీయ గీతం జనగణమనకు గౌరవాన్ని పరిరక్షించే నిబంధనలు అమల్లోకి వచ్చాయని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. పులుల సంరక్షణపై అవగాహన పెంపొందించడం, వాటి సహజ ఆవాసాలను పరిరక్షించడం, అడవుల్లో పులుల సంఖ్య తగ్గుదలను అరికట్టడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా వన్యప్రాణి ప్రేమికులందరికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ పులుల జనాభాలో దాదాపు 70 శాతం పులులు భారతదేశంలోనే ఉండటం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. పులుల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న అటవీ సిబ్బంది, శాస్త్రవేత్తలు, పరిరక్షణ కార్యకర్తలను ఆయన అభినందించారు. స్థానిక సమాజాలను మరింత బలోపేతం చేయడం, మానవ–వన్యప్రాణుల మధ్య సంఘర్షణలను తగ్గించడం పట్ల కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు. ఇక పులుల సంఖ్య పెరగడం భారత అటవీ సంపద ఆరోగ్యాన్ని, సంరక్షణపై దేశం చూపుతున్న ప్రత్యేక దృష్టిని ప్రతిబింబిస్తోందని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. పులులు, వాటి ఆవాసాలను పరిరక్షించడంతో పాటు అడవులపై ఆధారపడి జీవించే సమాజాల జీవనోపాధికి కూడా కేంద్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఒకే దేశం–ఒకే ఎన్నికకు సంబంధించిన చట్టాలపై పరిశీలన జరుపుతున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) గడువును పార్లమెంట్-2026 శీతాకాల సమావేశాల చివరి వారంలోని తొలి రోజు వరకు పొడిగిస్తూ.. లోక్‌సభ ఆమోదం తెలిపింది. జేపీసీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ పి.పి. చౌదరి 129వ రాజ్యాంగ సవరణ బిల్లు–2024, అలాగే కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) బిల్లు–2024లను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని సభలో ఈరోజు ప్రవేశపెట్టారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానాన్ని అమల్లోకి తీసుకురావడం ఈ రెండు బిల్లుల ప్రధాన ఉద్దేశం.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళం కోసం కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్ నిర్మిస్తున్న 8 యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ నౌకల్లో ఏడవదైన 'మచిలీపట్నం' యుద్ధనౌక ఈరోజు జలప్రవేశం చేసింది. ఈ యుద్ధనౌక సముద్ర గర్భ పర్యవేక్షణ, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ కార్యకలాపాలు, తక్కువ తీవ్రత కలిగిన సముద్ర భద్రతా కార్యకలాపాలు (LIMO) నిర్వహించడంతో పాటు మైన్ వార్‌ఫేర్ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నౌక తీర రక్షణను మరింత బలోపేతం చేయడంతో పాటు, సముద్ర భద్రతా పర్యవేక్షణ సామర్థ్యాన్ని పెంచుతుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక నౌకాశ్రయ నగరం మచిలీపట్నం పేరు ఈ యుద్ధనౌకకు పెట్టడం విశేషమని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. మచిలీపట్నం నగర చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా ఈ నౌక నిలుస్తుందని, దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణలో భారత నౌకాదళం నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఈ ప్రాజెక్టులో 80 శాతానికి పైగా స్వదేశీ తయారీ భాగాలు వినియోగించడం ద్వారా భారత నౌకా నిర్మాణ పరిశ్రమ సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు స్పష్టమవుతోందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 2వ తేదీన దేశవ్యాప్తంగా `నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్` యాత్రను ప్రారంభించనున్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా 100 వారాల పాటు ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ జాతీయ ఉద్యమానికి మై భారత్ వేదిక నాయకత్వం వహించనుంది. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ ఆన్‌లైన్ వేదిక ముఖ్య ఉద్దేశ్యం. మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణ లక్ష్యంతో యువతను ఏకం చేయడం, అవగాహన కల్పించడం, సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ప్రజల నిరంతర సహకారాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

గ్లాస్గో నగరం వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, పారా అథ్లెటిక్స్ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ పతకాల వర్షం కురిపిస్తున్నారు. మరిన్ని పతకాలు సాధించే అవకాశాలను కూడా సెలకొల్పుతున్నారు. మహిళల 69 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో హర్జిందర్ కౌర్ రజత పతకం సాధించింది. దీంతో భారత్ ప్రస్తుతం 2 స్వర్ణాలు, 7 రజతాలు, 3 కాంస్యాలు కలిపి మొత్తం 12 పతకాలను గెలుచుకుంది. ఇక పురుషుల 60 కిలోల క్వార్టర్ ఫైనల్లో టాప్స్ (TOPS) కోర్ అథ్లెట్ సచిన్ అద్భుత ప్రదర్శన చేశారు. బోట్స్వానాకు చెందిన ట్రెజర్ మోరేమిపై 5–0 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. దీంతో భారత్‌కు మరో పతకం ఖాయమయ్యింది. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ కూడా సెమీఫైనల్‌కు చేరుకొని సెమరో పతకాన్ని ఖాయం చేశారు. మహిళల 70 కిలోల విభాగంలో అరుంధతి చౌదరి, మహిళల 51 కిలోల బాక్సింగ్ క్వార్టర్ ఫైనల్లో సాక్షి సెమీఫైనల్స్ కు చేరుకున్నారు. ఈ కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల షాట్‌పుట్ ఫైనల్‌కు భారత ఆటగాళ్లు టాప్స్ డెవలప్‌మెంట్ అథ్లెట్ తజిందర్‌పాల్ సింగ్ తూర్, ఖేలో ఇండియా అథ్లెట్ సమర్‌దీప్ సింగ్ గిల్ అర్హత సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =